సాక్షి విశాఖపట్నం

గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



తీరు మారదా.!

పదే పదే హెచ్చరించినా..కొంత మంది టీచర్ల తీరు ఏమాత్రం మారడం లేదని డీఈవో చంద్రకళ ఆగ్రహించారు. 8లో



క్యాడెట్లకు సామర్థ్య పరీక్షలు

వీఎస్ కృష్ణ కాలేజీలో ఎన్‌సీసీ విద్యార్థులకు 'సీ' సర్టిఫికెట్ అందజేసే నిమిత్తం సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. 8లో



18న 'విష్ణు కథ' చూడండి

శివరాత్రి సందర్భంగా 18న 'వినరో భాగ్యము విష్ణు కథ' విడుదల కానుందని చిత్ర హీరో కిరణ్ అబ్బరం తెలిపారు. 10లో

న్యూస్‌రీల్

న్యాయవాదుల సంఘం ఎన్నికలకు నామినేషన్లు దాఖలు



అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి జి.ఎం.రెడ్డి

విశాఖ లీగల్: ప్రతిష్టాత్మకమైన విశాఖ న్యాయవాదుల సంఘం 131వ ఎన్నికల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. వివిధ పదవులకు పలువురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పదవులకు నామినేషన్లు దాఖలు కాలేదు. ఎన్నికల అధికారి జి.ఎం.రెడ్డి, ఉప ఎన్నికల అధికారి ఎం.కె.శ్రీనివాస్ నామినేషన్లు స్వీకరించారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం 4.30 వరకు నామినేషన్లకు గడువు ఉంది. ఈనెల 24న ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా కోర్టు ప్రాంగణం కోలాహలంగా కనిపించింది. వివిధ పదవులకు పోటీ చేస్తున్న న్యాయవాదులు ఓట్ల వేటలో పడ్డారు. తమను గెలిపించాలని ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

పాసింజర్ రైలు నడపనున్న పోర్టు!

రక్షణ, పౌర, ఉద్యోగుల కోసం..

సీతంపేట: విశాఖ నగరం నుంచి నావల్ డాక్‌యార్డు వరకు పాసింజర్ రైలు నడిపేందుకు ప్రతిపాదనలు చేసినట్లు పోర్టు ట్రస్టు సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ భవేష్‌కుమార్ తెలిపారు. ఎన్‌డి(వి) సమీపంలోని సర్దార్ వల్లబాయ్ పటేల్ వంతెన మరమ్మత్తుల కారణంగా మార్చి 15 నుంచి 15 నెలల పాటు మూసివేయబడుతుందని పేర్కొన్నారు. ఈ 15 నెలలు రక్షణ, పౌర ఉద్యోగులు ప్రత్యామ్నాయ పోర్టు రోడ్‌లో ప్రయాణించాల్సి ఉందని తెలిపారు. ఉద్యోగులు విధులకు వచ్చేటప్పుడు అదనంగా 6 కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో నగరంలో అనువైన ప్రదేశం నుంచి ఎన్‌డి (వి) విజయనగర్ గేటు వరకు పాసింజర్ రైలు నడపాలన్న ప్రతిపాదన వచ్చిందని పేర్కొన్నారు. ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు తిరిగి సాయంత్రం 4.30 నుంచి 7.30 గంటల వరకు పలు ట్రిప్పులు నడుపుతుందని తెలిపారు. ఇందుకు గల అభ్యంతరాలను తెలియజేయాలని ఆయా యూనియన్ల కోరింది.

రాత్రి విధులకు ఏఆర్ నుంచి 34 మంది

దొండపర్తి(విశాఖ దక్షిణ): నగరంలో రాత్రి సమయంలో విధులు నిర్వర్తించేందుకు సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ నుంచి 34 మంది పోలీస్ సిబ్బందిని వివిధ పోలీస్‌స్టేషన్లకు అటాచ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. నేర నియంత్రణపై దృష్టి సారించిన సీపీ పగటి పూటే కాకుండా రాత్రి సమయాల్లో సైతం పోలీస్ గస్తీని మరింత పెంచాలని నిర్ణయించారు. దీంతో ఏఆర్‌లో ఉన్న 34 మంది పోలీస్ సిబ్బంది సేవలను ప్రత్యేకంగా రాత్రి విధుల కోసమే వినియోగించేందుకు వారిని వివిధ పోలీస్‌స్టేషన్లకు అటాచ్ చేశారు. ఇందులో ముగ్గురు ఏఎస్‌ఐలతోపాటు 11 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 20 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు.


26 మంది బాల కార్మికులకు విముక్తి

దొండపర్తి(విశాఖ దక్షిణ): 'ఆపరేషన్ స్వేచ్ఛ' కార్యక్రమంలో భాగంగా నగరంలో మొత్తం 26 మంది బాలకార్మికులకు పోలీసులు విముక్తి కలిగించారు. బాలకార్మికులకు మంచి భవిష్యత్తు అందించాలన్న లక్ష్యంతో ఈ నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 22 మంది బాలురును, నలుగురు బాలికలను వెట్టి చాకిరీ నుంచి రక్షించారు. వీరిలో 12 మందిని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించగా, మిగిలిన 14 మందిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించారు.

96 మంది ఉద్యోగులకు నెహ్రూ అవార్డులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం 96 మంది ఉద్యోగులను జవహర్‌లాల్ నెహ్రూ అవార్డులకు ఎంపిక చేసింది. స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేసే ఉద్యోగులకు యాజమాన్యం ఏటా ఈ అవార్డులను ఇస్తారు. ఫిబ్రవరి 18న స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులను అందజేస్తారు. ఈ ఏడాదికి గాను 49 మంది అధికారులు, 47 మంది కార్మికులను యాజమాన్యం ఎంపిక చేసింది.

ఉదయ్ కథ కంచికేనా?



ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్

- విశాఖ- విజయవాడ డబుల్ డెక్కర్‌కు తగ్గిన డిమాండ్
- ఖాళీగా రాకపోకలు సాగిస్తున్న రైలు
- విశాఖ- భువనేశ్వర్ మార్గంలో నడిపేందుకు ఆలోచన?

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో మూడున్న రేళ్ల కిందట అట్టహాసంగా ప్రారంభించిన విశాఖపట్నం-విజయవాడ 'ఉదయ్'డబుల్ డెక్కర్ రైలు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏ ముహూర్తాన 'ఉదయ్'అని పేరు పెట్టారో గానీ.. త్వరలోనే ఈ రైలు కథ కంచికి చేరనున్నట్లు తెలుస్తోంది. ఈ డబుల్ డెక్కర్ రైలును ఈ మార్గంలో నుంచి తీసేసి.. రద్దీ గల వేరే మార్గంలో నడిపేందుకు రైల్వే అధికారులు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

ఇదీ 'ఉదయ్'కథ

2019 సెప్టెంబర్ 26న నాటి రైల్వే సహాయ మంత్రి సురేష్ చెన్నబసప్ప అంగడి ఉదయ్ రైలును ప్రారంభించారు. సెప్టెంబర్ 27 నుంచి రెగ్యులర్ రైలుగా విశాఖపట్నం-విజయవాడ-విశాఖపట్నం (22701/22702) మధ్య రాకపోకలు ప్రారంభించింది. ఈ రైలు ప్రతీ సోమ, మంగళ, బుధ, శుక్ర, శనివారాల్లో ఇరు మార్గాల్లో ప్రయాణం సాగిస్తోంది. విశాఖపట్నంలో ప్రతి రోజూ ఉదయం 5.45 గంటలకు బయలుదేరి ఉదయం 11.15 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 5.30 గంటలకు విజయవాడలో బయలుదేరి రాత్రి 11 గంటలకు విశాఖపట్నం వస్తుంది. తర్వాత ఈ రైలు బయలుదేరే సమయం విశాఖపట్నం నుంచి ఉదయం 5.25కు మార్చారు. ఈ రైలు మొత్తం 928 సీట్లతో తొమ్మిది ఏసీ కోచ్‌లతో నడుస్తుంది.

జనవరి 27 నుంచి ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లో మిగిలిపోయిన సీట్లు

తేదీ	విశాఖ-విజయవాడ	విజయవాడ -విశాఖ
జనవరి 27	180	380
28	113	427
30	567	578
31	584	602
ఫిబ్రవరి 01	580	585
03	575	578
04	604	611
06	608	608
07	613	616
08	599	599
10	609	608

ఇదే తేదీల్లో విశాఖపట్నం-భువనేశ్వర్-విశాఖపట్నం ఇంటర్ సిటీ ప్రతి రోజూ చెయిర్‌కార్‌లో దాదాపుగా వెయిటింగ్ లిస్ట్‌తో రాకపోకలు సాగించింది.

తగ్గిన ఆక్యుపెన్సీ

ఇటీవల ఇదే మార్గంలో విశాఖపట్నం-సికింద్రాబాద్ (20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశ పెట్టారు. దీంతో ఉదయ్‌కు డిమాండ్ తగ్గింది. విశాఖపట్నం నుంచి ఇదే సమయంలో నాలుగు రైళ్లు బయలుదేరుతుండడం మరో కారణం. విశాఖపట్నం నుంచి ఉదయం వరుసగా విశాఖపట్నం-విజయవాడ (22701) డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ 5.25 గంటలకు, విశాఖపట్నం-సికింద్రాబాద్ (20833) వందేభారత్ 5.45 గంటలకు, విశాఖపట్నం-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఉదయం 6.20 గంటలకు, విశాఖపట్నం-గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఉదయం 7.10 గంటలకు బయలుదేరుతున్నాయి. ఈ కారణంగా ఉదయ్‌కు డిమాండ్ తగ్గింది. అందువల్ల దీనిని పునఃసమీక్షించేందుకు రైల్వే ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఈ మార్గంలో ఉదయ్‌ను తప్పించి డిమాండ్ ఉన్న భువనేశ్వర్ మార్గంలో విశాఖపట్నం-భువనేశ్వర్-విశాఖపట్నం ఇంటర్ సిటీగా నడిపేందుకు ప్రయత్నాలు సాగుతున్నట్లు సమాచారం.

తిరుపతి డబుల్ డెక్కర్ కూడా...

ఇక విశాఖపట్నం-తిరుపతి-విశాఖపట్నం(22707/22708) మధ్య నడిచే డబుల్ డెక్కర్ పరిస్థితి కూడా ఇలానే ఉంది. విశాఖపట్నం నుంచి తిరుపతికి రాకపోకలు సాగించే అన్ని రైళ్లు అన్ని వేళల్లో పూర్తి ఆక్యుపెన్సీతో నడుస్తుంటే ఈ డబుల్ డెక్కర్‌లో మాత్రం ఎప్పుడూ సీట్లు మిగిలిపోతూనే ఉన్నాయి. కారణం ఈ రైలులో సీటింగ్ సౌకర్యం సరిగా లేకపోవడమే. అంతదూరం ఈ రైలులో ప్రయాణం చేసే వారు నానా బాధలు పడుతున్నారు. అందుకే ఈ రైలులో ప్రయాణించేందుకు ఎవరూ సాహసించడం లేదు. తిరుమల ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-తిరుపతి-విశాఖపట్నం (08583 /08584) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లు ఎప్పుడూ పూర్తి ఆక్యుపెన్సీతో ప్రయాణిస్తున్నాయి. కానీ ఈ డబుల్ డెక్కర్ మాత్రం ఖాళీగానే వెళ్తోంది.

బ్యూటీ.. సిటీ కోసం..

చురుగ్గా సుందరీకరణ పనులు

- ఆర్.కె.బీచ్ తరహాలో మిగిలిన బీచ్‌ల అభివృద్ధి
- జీవీఎంసీలో డోర్ లాకింగ్ సిస్టమ్
- చిరు వ్యాపారుల కోసం వెండర్స్ జోన్లు
- కమిషనర్ రాజాబాబు వెల్లడి



మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్: జీ–20 సదస్సు నేపథ్యంలో నగర సుందరీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రోడ్లు, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, విద్యుత్, పారిశుధ్యం, బ్యూటిఫికేషన్ వంటి పనులు చేపడుతున్నారు. ఆర్కే బీచ్ తరహాలోనే జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్, ఇస్కాన్ టెంపుల్ బీచ్‌ను ఆధునికీకరించేందుకు సిద్ధమయ్యారు. పార్కింగ్ స్థలాలు, బెంచ్‌లు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దనున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో కమిషనర్ పి.రాజాబాబు జీ–20 సదస్సు ఏర్పాట్ల వివరాలు వెల్లడించారు. ముందస్తు ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. జీవీఎంసీ పరిధిలో రోడ్లు, మీడియన్లు, పెయింటింగ్, బీచ్ అభివృద్ధి, జంగిల్ క్లియరెన్స్ పనులు జరుగుతున్నాయని.. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ సహాయంతో గ్రీనరీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

ఫుట్‌పాత్‌ల ఆధునికీకరణ

ఫుట్‌పాత్‌లను ఆధునికీకరిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులకు వెండర్స్ జోన్స్ ఏర్పాటు చేసి, వారిని అక్కడకు తరలిస్తామన్నారు. ఆయా జోన్ల పరిధిలోని ఖాళీ స్థలాలు, రద్దీ లేని సర్వీస్ రోడ్లలో వెండర్స్ జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. తెలుగుతల్లి ఫ్లైఓవర్‌ను మరింత అభివృద్ధి చేసి.. ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో డోర్ లాకింగ్ సిస్టమ్ అమలు చేస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ప్రతీ ఉద్యోగి తన ఐడీ కార్డును డోర్ వద్ద ఉన్న స్కానింగ్ మిషన్ వద్ద స్కాన్ చేయాలని ఆదేశించారు. అప్పుడే డోర్ ఓపెన్ అవుతుందన్నారు. ఉద్యోగి ఏ సమయానికి కార్యాలయానికి వచ్చారు.. ఏ సమయానికి బయటకు వెళ్లారో తెలుస్తుందన్నారు. అలాగే విజిటర్స్ కోసం ఫ్రంట్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బీచ్‌రోడ్‌లో 40 సీసీ కెమెరాల ఏర్పాటు

బీచ్ రోడ్డులో 40 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. రాత్రి వేళల్లో స్పీడ్‌గా/ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారి కోసం ఆటోమేటిక్ స్పీడ్ రికార్డర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పారిశుధ్య పనులు 24 గంటలూ కొనసాగుతున్నాయని.. టెండర్లలో పారదర్శకత పాటిస్తున్నట్లు తెలిపారు. భీమిలో జోన్‌లోని డంపింగ్ యార్డ్ తప్పితే.. మిగిలిన అన్ని డంపింగ్ యార్డ్‌లను క్లియర్ చేశామన్నారు. డంపింగ్ యార్డుల నుంచి ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

ప్రత్యేక డ్రైవ్ ద్వారా పందులను నిర్మూలిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలు బ్యాన్ చేసిన దృష్ట్యా జీవీఎంసీ పరిధిలో డిజిటల్ బోర్డులు ఏర్పాటుకు అనుమతిస్తున్నట్లు చెప్పారు. ఎన్ఏడీ జంక్షన్ నుంచి అప్పుఘర్ వరకు బోర్డుల ఏర్పాటుకు 8 ఏజెన్సీలు ముందుకొచ్చాయని.. కౌన్సిల్ సభ్యుల నిర్ణయం మేరకు అనుమతి మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, పట్టణ ప్రణాళికా అధికారి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

రొయ్యల ఎగుమతికి లైన్‌క్లియర్

- కొన్నాళ్లుగా విశాఖ విమానాశ్రయంలో నిలిచిన ఎయిర్ కార్గో
- తాజాగా సరకు రవాణాకు అనుమతులు ఇచ్చిన బీసీఏఎస్



ఎయిర్‌పోర్టులో కార్గో రవాణా దృశ్యం (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎట్టకేలకు రొయ్య పిల్లల రవాణాకు అనుమతులు లభించాయి. విమానాశ్రయాల్లో నిర్దేశిత నిపుణులైన స్క్రీనర్లు లేని కారణంగా విశాఖ, విజయవాడ సహా దేశంలోని తొమ్మిది ఎయిర్‌పోర్టుల్లో జనవరి ఒకటి నుంచి ఎయిర్ కార్గో రవాణాకు బ్రేకులు పడ్డాయి. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) సరకు రవాణా ను నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఇన్నాళ్లూ ఆయా విమానయాన సంస్థలే కార్గో స్క్రీనింగ్ వ్యవహారాలు చూసుకునేవి. ఇటీవల ఆ బాధ్యతలను బీసీఏఎస్ పర్యవేక్షిస్తోంది. భద్రతా కారణాల దృష్ట్యా విమానాశ్రయాల్లో బీసీఏఎస్ నిబంధనలకనుగుణంగా నియమితులైన స్క్రీనర్లతోనే సరకు తనిఖీలు చేపట్టడం తప్పనిసరి చేసింది. వీటిని ఇప్పటికీ అమలు చేయని విమానాశ్రయాల్లో కార్గో బుకింగ్, రవాణాను నిలిపివేస్తూ బీసీఏఎస్ నిర్ణయం తీసుకుంది. గతంలో విశాఖ విమానాశ్రయం నుంచి స్పైస్ జెట్ సంస్థ ప్రత్యేకంగా ఒక కార్గో విమానాన్ని నడిపేది. కోవిడ్ ప్రభావంతో దానిని రద్దు చేసింది. ప్రస్తుతం ఈ ఎయిర్‌పోర్టు నుంచి సరకు రవాణాకు ప్రత్యేకంగా కార్గో విమానాలు నడవడం లేదు. పాసింజరు విమానాల్లో కేటాయించిన మేరకు వివిధ ప్రాంతాలకు కార్గో రవాణా జరుగుతోంది. కాగా నిలిచిపోయిన కార్గో రవాణాను తక్షణమే పునరుద్ధరించాలంటూ విమానయాన సంస్థలు, ఎయిర్‌పోర్టు అధికారులు బీసీఏఎస్‌ను ఎవరి స్థాయిలో కోరారు.

ఇక సరుకు రవాణా జోరు

విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రోజుకు 80 వరకు పౌర విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి ద్వారా నెలకు సగటున 300 టన్నుల సరకు రవాణా జరుగుతోంది. వీటిలో వైద్య పరికరాలు, అత్యవసర మందులు, రక్త పరీక్షల నమూనాలు, ఫార్మా, మత్స్య ఉత్పత్తులు, టెక్స్‌టైల్ వంటివి ఉన్నాయి. 45 రోజులుగా ఈ విమానాశ్రయం నుంచి కార్గో రవాణా నిలిచిపోవడంతో సంబంధీకులు రోడ్డు, రైలు మార్గాల్లో తమ సరకు/ఉత్పత్తులను పంపిస్తున్నారు. మరీ అత్యవసరమైతే తేలికైన వస్తువులు, సరకులు, మందులు, రక్త నమూనాలు వంటి వాటిని విమాన టికెట్టు బుక్ చేసుకుని తమ వెంట తీసుకెళ్లి వస్తున్నారు. ఇలా రవాణా చేసే సమయంలో ఆక్సిజన్ సరిగా అందక పెద్ద ఎత్తున రొయ్య పిల్లలు చనిపోతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా విశాఖ విమానాశ్రయం నుంచి రొయ్య పిల్లలను కార్గో ద్వారా రవాణా/ఎగుమతులకు అనుమతులిస్తూ పౌర విమానయానశాఖ జేడీ అవధేష్ ప్రతాప్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే రక్షణరంగ ఉత్పత్తుల రవాణాకు బీసీఏఎస్ అనుమతించిందని, తాజాగా రొయ్య పిల్లల(ష్రింప్ సీడ్) రవాణాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని విమానాశ్రయం డైరెక్టర్ కె.శ్రీనివాసరావు 'సాక్షి'తో చెప్పారు.

నేటి నుంచి పట్టభద్రుల నామినేషన్ల స్వీకరణ

- ఇప్పటికే నామినేషన్ పత్రాలు తీసుకున్న 12 మంది
- తొలి నామినేషన్ వేయనున్న ప్రజాసంఘాల ఉమ్మడి అభ్యర్థి
- ఈ ఎన్నికకు వైట్ కలర్ బ్యాలెట్ పేపర్ కేటాయింపు
- ఉద్యోగులకు సెలవులు రద్దు



నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు తీసుకుంటారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్ పరిధిలో 100 మీటర్ల వరకూ 144 సెక్షన్ విధించారు. నామినేషన్ల స్వీకరణకు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్(ఎస్‌ఐసీ)ని హెల్ప్‌డెస్క్‌గా ఏర్పాటు చేశారు. అభ్యర్థులు, బలపరచనున్న వ్యక్తులు ఈ హెల్ప్‌డెస్క్‌లో నామినేషన్లకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకొని.. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, కలెక్టర్ డా.మల్లికార్జునకు అందజేయనున్నారు. అభ్యర్థులు, వారి వెనుక వచ్చే వారు నిరీక్షించేందుకు సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ నెల 23వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఇప్పటికే 12 మంది నామినేషన్ పత్రాలు తీసుకున్నారు. సెలవు రోజుల మినహా మిగిలిన రోజుల్లో నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు అవకాశాన్ని కల్పించారు. నామినేషన్లకు వచ్చే అభ్యర్థుల చర్యలను పర్యవేక్షించడంతో పాటు ఎన్నికల సంఘానికి పంపించేందుకు వీడియో రికార్డింగ్ ఏర్పాట్లు కూడా చేశారు. దీనికి సంబంధించి కలెక్టరేట్ నుంచి మోనటరింగ్ వ్యవస్థను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు డీఆర్‌వో వెల్లడించారు. మరోవైపు.. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పాటించాల్సిన నియమ నిబంధనలపై చీఫ్ ఎలక్టోరల్ కార్యాలయ అధికారులు డీఆర్‌వో, పోలింగ్ సిబ్బందికి వర్చువల్ విధానంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్, రెవెన్యూ పరిధిలో ఉన్న ఉద్యోగులకు అత్యవసర మినహా సెలవులు రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

బ్యాలెట్‌పై అభ్యర్థి పేరు, ఫొటో, పార్టీ పేరు

పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి తెల్ల రంగు బ్యాలెట్ పేపర్‌ని ముద్రిస్తారు. బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్లు వరుస క్రమం జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు, ఇండిపెండెంట్స్ క్రమంలో ఆల్ఫాబెట్స్ ఆధారంగా ముద్రిస్తారు. బ్యాలెట్ పేపర్‌పై సీరియల్ నంబర్ తర్వాత అభ్యర్థి పేరు బ్రాకెట్‌లో బలపరిచిన పార్టీ పేరు, ఫొటో ముద్రిస్తారు. చివరి కాలమ్‌లో అభ్యర్థిని బలపరిచే ప్రాధాన్యత సంఖ్యని ఓటరు వేసే విధంగా ఉంచేలా ముద్రిస్తారు. ఇప్పటివరకు 2.87 లక్షల పైచిలుకు ఓటర్లున్నట్లుగా గుర్తించారు. మరి కొన్ని దరఖాస్తులు ఇంకా పరిశీలనలో ఉన్నాయి.

11 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు

జీవీఎంసీ పరిధిలో ఉన్న 8 జోనల్ కార్యాలయాలకు సంబంధించిన జోనల్ కమిషనర్లకు ఎన్నికల ప్రవర్తన నియమావళి పరిశీలకులుగా నియమించారు. అదేవిధంగా 11 మంది తహసీల్దార్లను ఫ్లయింగ్ స్క్వాడ్స్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి తహసీల్దారుతో ఒక వీడియోగ్రాఫర్ కూడా ఉంటారు. నామినేషన్లు వేసే అభ్యర్థుల సంఖ్యను బట్టి ఫ్లయింగ్‌స్క్వాడ్స్‌ని పెంచే అవకాశం ఉందని డీఆర్‌వో తెలిపారు.

ముహూర్తం చూసుకుంటున్న అభ్యర్థులు

ఇప్పటికే ప్రచారంలో తలమునకలై ఉన్న అభ్యర్థులు నామినేషన్ల పర్వం ప్రారంభమైన నేపథ్యంలో దానికి సంబంధించిన ఏర్పాట్లుపై ప్రధాన దృష్టిసారించారు. మంచి ముహూర్తాల కోసం వెతుకులాట ప్రారంభించారు. తమ పేరు, జాతకరీత్యా కలిసొచ్చే ముహూర్తం వేటలో ఉన్నారు. 23వ తేదీ వరకు సమయం ఉండటంతో వారం వర్జ్యం చూసుకుంటున్నారు. మరోవైపు.. తొలిరోజునే మొదటి నామినేషన్ వేసేందుకు ప్రజాసంఘాల ఉమ్మడి అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ సిద్ధమయ్యారు. ఉదయం 11 గంటలకు ర్యాలీగా బయలుదేరి నామినేషన్ వేయనున్నారు.

ముడసర్లోవ ప్రాంతం సుందరీకరణకు కృషి



ముడసర్లోవలో ఫ్లోటింగ్ సోలర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రాజాబాబు

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్ ప్రాంతాన్ని మరింత అందంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. ముడసర్లోవ రిజర్వాయర్‌లోని ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను బుధవారం ఆయన అధికారులతో కలసి సందర్శించారు. అనంతరం డంపింగ్ యార్డు నుంచి ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ వరకు ఉన్న రోడ్డును పరిశీలించారు. ఈ రోడ్డు పిచ్చి మొక్కలు, గృహ వ్యర్థాలతో అస్తవ్యస్తంగా ఉండడంతో అధికారులపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీ–20 దేశాల సదస్సులో భాగంగా వివిధ దేశాల ప్రతినిధులు ముడసర్లోవలోని సోలార్ ప్లాంట్‌ను పరిశీలించనున్నారని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని సుందరంగా తయారు చేయాలని ఆదేశించారు. సోలార్ ప్లాంట్ వద్ద మొక్కలు నాటడంతో పాటు శుభ్రం చేయాలన్నారు. గృహ వ్యర్థాలను వెంటనే తరలించాలని సూచించారు. ఆరిలోవ కాలనీ ఆఖరి బస్ స్టాప్ వద్ద, డంపింగ్ యార్డు వద్ద సీసీ కెమెరాలు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. హనుమంతవాక నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డును సుందరీకరణ చేయాలన్నారు. అదనపు కమిషనర్లు సన్యాసిరావు, శ్రీనివాసరావు, పర్యవేక్షణ ఇంజినీర్లు శ్యాంసన్ రాజు, గోవిందరావు, సీఎంవో శాస్త్రి, డీడీహెచ్ దామోదర్, డీసీపీ పద్మజ, జెడ్సీ కనకమహాలక్ష్మి, పలు విభాగాల ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

డాబాగార్డెన్స్:

మహాశివరాత్రి పురస్కరించుకుని ఈ నెల 18న జిల్లాలోని వివిధ శైవ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ అప్పలరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 4 గంటల నుంచి ద్వారకా బస్టేషన్ నుంచి అప్పికొండ శైవక్షేత్ర దర్శనానికి 5 బస్సులు, మధ్యాహ్నం 12 గంటల నుంచి సింధియా నుంచి 10 బస్సులు, సాయంత్రం 4 గంటల నుంచి కొత్త గాజువాక నుంచి 10 బస్సులు, రాత్రి 10 గంటల నుంచి కొత్త గాజువాక నుంచి అప్పికొండకు 10 బస్సులు, అలాగే 19 వేకువజాము 2 గంటల నుంచి కొత్త గాజువాక నుంచి అప్పికొండ శైవక్షేత్ర దర్శనాలు, పవిత్ర స్నానాల కోసం 15 బస్సులు, కూర్మన్నపాలెం నుంచి 30 బస్సులు నడపనున్నట్టు చెప్పారు.

ఆర్కేబీచ్‌కు..: 18వ తేదీ రాత్రి 10 గంటల నుంచి సింహాచలం/పెందుర్తి నుంచి ఆర్కేబీచ్‌కు 10 బస్సులు, పాత గాజువాక నుంచి ఆర్కేబీచ్‌కు 5 బస్సులు, 19 వేకువజాము 2 గంటల నుంచి పాత గాజువాక నుంచి 15, కొత్తవలస/పెందుర్తి నుంచి 20 బస్సులు నడపనున్నట్టు చెప్పారు. ఆ రోజు ఉదయం 5 గంటల నుంచి ఆరిలోవ/రవీంద్రనగర్ నుంచి 10, మాధవధార నుంచి 5, మారికవలస/పీఎం పాలెం నుంచి 10 బస్సులు ఆర్కేబీచ్‌కు నడపనున్నట్టు చెప్పారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అప్పలరాజు కోరారు.

కొండ దిగిన కోడి

భారీగా తగ్గిన చికెన్ ధరలు

కేజీ లైవ్ : రూ.90
స్కిన్ : రూ.150
స్కిన్ లెస్: రూ.160

అల్లిపురం (విశాఖ దక్షిణ): చికెన్ ధరలు భారీగా పతనమయ్యాయి. నెల రోజులుగా తగ్గుతూ వస్తున్న ధరలు రూ.220 నుంచి రూ.160కు చేరాయి. కిలోకు దాదాపు దాదాపు రూ.60 తగ్గింది. అయినప్పటికీ కొంతమంది రిటైల్ వ్యాపారులు ధరలు తగ్గించకుండా పాత ధరలకే అమ్ముతుండటంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే, బ్రాయిలర్ కోడి లైవ్ ధర రూ.90కు పడిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోడిగుడ్డుదీ అదే దారి..

కోడిగుడ్డు ధరలు పది రోజులుగా తగ్గుముఖం పట్టాయి. వంద కోడిగుడ్లు జనవరిలో రూ.555 ఉండగా, ప్రస్తుతం రూ.440 ఉంది. రిటైల్‌లో మాత్రం వ్యాపారులు ఒకటి రూ.6 నుంచి రూ.6.50 వరకు అమ్ముతున్నారు.



గిట్టుబాటు కావడం లేదు

కోళ్ల రైతులకు ప్రస్తుత ధరలు గిట్టుబాటు కావటం లేదు. పిల్ల రేటు, ఫీడ్ రేటు పెరిగిపోయింది. మరో పక్క ట్రాన్స్‌పోర్టు చార్జీలు, లేబర్ చార్జీలు పెరిగిపోయాయి. చికెన్ ధరలు భారీగా పడిపోవడంతో తీవ్ర నష్టాలు చవిచూస్తున్నాం. ప్రభుత్వం చికెన్ వ్యాపారులను ఆదుకోవాలి.

– టి.అప్పారావు, బ్యాగ్ అధ్యక్షుడు

వినియోగదారుల సదస్సు రేపు

విశాఖలీగల్: వినియోగదారుల సదస్సు ఈ నెల 17న నిర్వహించనున్నట్లు విశాఖ జిల్లా వినియోగదారుల న్యాయస్థానం–2 న్యాయమూర్తి గేదెల వేంకటేశ్వరి తెలిపారు. మారుతున్న చట్టాలు, సాంకేతికత, వినియోగదారుల హక్కులు వంటి అంశాలను ఈ సదస్సులో వివరిస్తారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, సీనియర్ న్యాయవాదులు, వినియోగదారుల సేవా సంఘాల ప్రతినిధులు, అధికారులు సదస్సులో పాల్గొంటారని న్యాయమూర్తి చెప్పారు.

ఎంఎస్ఎంఈల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న వినయ్ ఆచారి

బీచ్‌రోడ్డు: చిన్న మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తున్నామని కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ డీజీఎం సీహెచ్ వినయ్ ఆచారి అన్నారు. సిరిపురంలోని కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన అనేక పథకాల్లో భాగస్వామ్యం వహించినట్లు చెప్పారు. ఖాతాదారులకు ఎదురైన సమస్యలు, వాటి పరిష్కారాలను వివరించారు. డీజీఎం సీహెచ్ గణపతి, ఏజీఎం జి.వి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న హుండీల ఆదాయం రూ.65.47 లక్షలు

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహ స్వామి హుండీల ఆదాయం లెక్కింపు రెండవ రోజైన బుధవారం కూడా కొనసాగింది. ఈ లెక్కింపు ద్వారా రూ.65,47,436 నగదుతో పాటు 31.200 గ్రాముల బంగారం, 4.485 కిలోల వెండి లభించినట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో సుజాత, అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీలో విశాఖ సత్తా

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో మూడు రోజులుగా నిర్వహించిన అంతర్ జిల్లా ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీలు బుధవారంతో ముగిశాయి. విజేతలకు జేసీ ఆనంద్ పతకాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అండర్–14 బాలురు విభాగంలో ఎస్.రామచైతన్య ప్రథమ స్థానం, అండర్–17 బాలుర విభాగంలో ఆర్.నాగేంద్రబాబు ప్రథమ స్థానం, కె.భరత్‌తేజ తృతీయ స్థానంలో నిలిచారు.

తీరు మారదా..!

- బైజూస్ పాఠ్యాంశాల బోధనపై నిర్లక్ష్యమేల?
- ఉపాధ్యాయుల పనితీరుపై డీఈవో ఆగ్రహం
- ఇద్దరు హెచ్ఎంలు, 15 మంది టీచర్లకు షోకాజ్ నోటీసులు

విశాఖ విద్య: ఉపాధ్యాయుల పనితీరు మెరుగుపరుచుకోవాలని పదే పదే హెచ్చరించినా, కొంత మంది తీరు ఏమాత్రం మారకపోవడంపై డీఈవో ఎల్.చంద్రకళ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బుధవారం బీచ్‌రోడ్‌లో ఉన్న శ్రీరంగాపురం, న్యూ కాలనీలోని జీవీఎంసీ పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. శ్రీరంగాపురం ప్రాథమిక పాఠశాలలో సిలబస్ పూర్తి కాకపోవడం, వర్క్‌బుక్స్‌ను విద్యార్థులతో సవ్యంగా రాయించకపోవటాన్ని గుర్తించారు. కొద్ది మంది విద్యార్థులు వర్క్ రాసినా, వాటిని దిద్దకపోవటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల హెచ్ఎం ఎ.అఖిల్, ఇటీవల వేరే పాఠశాలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై బదిలీ అయిన ఉపాధ్యాయుడు అప్పలనాయుడుకు షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆమె న్యూకాలనీ హైస్కూల్‌ను సందర్శించి, 8వ తరగతి గదిలో కాసేపు కూర్చొని విద్యార్థుల బోధన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులతో పాటు, తరగతి ఉపాధ్యాయులు సైతం బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను వినియోగించడం లేదని గుర్తించారు. బైజూస్ పాఠ్యాంశాల బోధనపై శ్రద్ధ తీసుకోవాలని తరచూ సమీక్ష చేస్తున్నా, ఏమాత్రం పట్టించుకోకపోవటంపై హెచ్ఎం జి.సన్యాసినాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు నోట్స్‌లను దిద్దటంలో సబ్జెక్టు ఉపాధ్యాయులు శాస్త్రీయ పద్ధతులను పాటించటం లేదన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలన చేయకుండా, తూతూ మంత్రంగా ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల పని తీరును అంచనా వేయడంలో హెచ్ఎం బాధ్యతారాహిత్యం కనిపిస్తోందన్నారు. ఇలా అయితే విద్యార్థులు చదువుల్లో ఎలా రాణిస్తారని ప్రశ్నించారు. ఇందుకు బాధ్యులుగా హెచ్ఎంతో పాటు, పాఠశాలలో పని చేస్తున్న 14 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై తగిన సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఈవో వెంట జిల్లా విద్యా శిక్షణా సంస్థ అధ్యాపకుడు గొట్టేటి రవి, తదితరులు ఉన్నారు.

గడపగడపకు సంక్షేమం


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు

సాక్షి, విశాఖపట్నం: సోషల్ మీడియాను ఆయుధంగా చేసుకుని.. ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు చేరువ చేసే బాధ్యత వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు, కో–కన్వీనర్లపై ఉందని పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్లు, కో–కన్వీనర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకే ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు వెళ్లి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరించి.. వారి సమస్యలు తెలుసుకుంటున్నారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో పాటు మీరు కూడా ప్రభుత్వానికి రక్షణ కవచంలా నిలవాలన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు అందరం కలిసి కృషి చేద్దామన్నారు. ప్రభుత్వం అందించే ప్రతీ సంక్షేమ పథకాన్ని నిరుద్యోగులు, ఉద్యోగులకు వివరించాలని సూచించారు. సమావేశంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్లు, కో–కన్వీనర్లు ప్రసాద్ సిద్ధు, సదరం జ్ఞానేష్, గోపీరాజ్ వంక, శిరపు వంశీ రెడ్డి, గరికిన వెంకట్, బండారు భవానీ శంకర్, విష్ణు వర్ధన్, కిలాని రామ్ ప్రసాద్, గరికినా రాధా కృష్ణ, జల్లి రాజశేఖర్, నెల్లి వంశీ, నమ్మి భారత్, సిరిపురపు అన్నమణి, గర్భపు అనిల్ శర్మ, షేక్ అబ్దుల్ ఖాదర్, డేనియల్ ఫిన్నీ, మడక శ్రీనివాస్, తంతటి సంపత్ కుమార్, షాహిద్ హుస్సేన్ షేక్, మోహన్, ప్రసాద్ కల్లూరి తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్‌లో కిడ్నాప్.. తాడివారిపల్లెలో హత్య

- ఘాట్ రోడ్డులో కాలిన మృతదేహం కేసులో వీడిన మిస్టరీ
- అక్రమ సంబంధమే దేవధరణి హత్యకు కారణం


దేవధరణ్(ఫైల్)

పొదిలిరూరల్ (ప్రకాశం జిల్లా): ఒంగోలు–నంద్యాల రహదారిలో తాడివారిపల్లె చెక్‌పోస్టు సమీపంలో కాలిన మృతదేహం కేసులో మిస్టరీ వీడింది. అక్రమ సంబంధం నేపథ్యంలో బత్తుల దేవధరణి అనే యువకుడిని దారుణంగా హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. బుధవారం రాత్రి పొదిలి సర్కిల్ కార్యాలయంలో దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి హత్య కేసు వివరాలు విలేకరులకు వెల్లడించారు. నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం పెద్ద ఎమ్మనూరు గ్రామానికి చెందిన బత్తుల దేవధరణి(22) చిన్నప్పటి నుంచి చెడు వ్యవసనాలకు బానిసై తిరుగుతుండేవాడు. మహిళలకు ఫోన్ చేసి మాట్లాడటం, ఆకతాయితనంగా ఉండటంతో తన అన్న పవన్‌సాయి విశాఖపట్నంలో తన దగ్గరకు తీసుకెళ్లాడు. అక్కడే ఇంటర్ వరకు చదివించడంతోపాటు ఓ రెస్టారెంట్లో పనిలో చేర్చాడు. చదువు మధ్యలో ఆపేసిన దేవధరణి నిత్యం సామాజిక మాధ్యమాల్లో చాటింగ్ చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. ఈ క్రమంలో గంగ అనే యువతి పరిచయం కాగా ఆమెతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. గంగకు ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తితో ముందే అక్రమ సంబంధం ఉంది. దీంతో దేవధరణి, ప్రవీణ్‌కుమార్ మధ్య తరచూ వివాదం నడుస్తోంది. వీరిద్దరితో పవన్‌సాయి మాట్లాడి సర్దుబాటు చేసినప్పటికీ గంగతో దేవధరణి చాటింగ్ మాత్రం ఆపలేదు. దీంతో దేవధరణిని అడ్డు తొలగించాలని ప్రవీణ్‌కుమార్ పథకం రచించాడు. అహోబిలం వెళ్లేందుకని చెప్పి జనవరి 30న బాడుగకు కారు మాట్లాడాడు. మనోజ్, చాణక్య, శివకుమార్, నరేష్, స్వప్న అనే యువతి దేవధరణిని నమ్మించి కారులో ఎక్కించారు. మార్గమధ్యంలో దేవధరణికి క్లోరోఫామ్ ఇచ్చి స్పృహలో లేకుండా చేశారు. క్లోరోఫామ్ ప్రభావంతో దేవధరణి కారులోనే మలమూత్రాలు విసర్జించడంతో తర్లుపాడు మండలం తాడివారిపల్లె ఘాట్ రోడ్డులో కారు ఆపి కిందకు దించారు. అటవీ ప్రాంతంలో కత్తితో గొంతు కోసి, పెట్రోల్ పోసి కాల్చి చంపారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి దేవధరణి కనిపించకపోవడంతో సోదరుడు పవన్‌సాయి విశాఖపట్నం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితులు చంపడానికి ఉపయోగించిన బాడుగ కారు డ్రైవర్ శివకిరణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించడంతో నేరం అంగీకరించాడు. నిందితుల్లో ఒకడు అరెస్టయ్యాడని, మిగిలిన వారిని త్వరలో పట్టుకుంటామన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు సామర్థ్య పరీక్షలు


సామర్థ్య పరీక్షల్లో పాల్గొన్న క్యాడెట్లు

విశాఖ విద్య: నగరంలోని డాక్టర్ వీఎస్ కృష్ణ కాలేజీ క్రీడా మైదానంలో 13(ఏ) బెటాలియన్ ఎన్‌సీసీ విద్యార్థులకు 'సీ' సర్టిఫికెట్ అందజేసే నిమిత్తం బుధవారం సామర్థ్య పరీక్షలను నిర్వహించారు. 13(ఏ)బెటాలియన్ పరిధిలోని విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల పరిధిలోని 16 డిగ్రీ కాలేజీల నుంచి ఎన్‌సీసీ శిక్షణ పొందుతున్న 367 మంది క్యాడెట్లు హాజరయ్యారు. మాక్ డ్రిల్, వెపన్ వినియోగం, వెపన్ సిద్ధం చేయడం వంటి అంశాలపై వారిని పరీక్షించారు. సీ సర్టిఫికెట్ పొందిన విద్యార్థులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యం ఉంటుంది. తమ భవిష్యత్తుకు భరోసా ఇచ్చే శిక్షణ కావటంతో విద్యార్థులు తాము నేర్చుకున్న విన్యాసాలను అధికారుల ముందు ఉత్సాహంగా ప్రదర్శించారు. 14వ బెటాలియన్ కమాండెంట్ కల్నల్ అమిత్ బెనర్జీ, 2(ఏ) సీటీఆర్ విశాఖపట్నం గ్రూప్ కమాండెంట్ కల్నల్ తపస్‌మండల్ వీటిని పర్యవేక్షించారు. వీటిలో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 19న జాతీయ స్థాయిలో నిర్వహించే రాత పరీక్షలో పాల్గొనాల్సి ఉంటుందని ఎన్‌సీసీ అధికారులు తెలిపారు.

తొట్లకొండపై గుడి కట్టారంటూ ప్రచారం

- ఆందోళనకు యత్నించిన బుద్దిస్ట్ మాన్యుమెంట్ ప్రొటెక్షన్ కమిటీ
- ఎలాంటి నిర్మాణాలు లేకపోవడంతో వెనుదిరిగిన సభ్యులు


బుద్ధిస్ట్ మాన్యుమెంట్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

కొమ్మాది(భీమిలి): ప్రముఖ పర్యాటక ప్రాంతం తొట్లకొండ బౌద్ధారామంపై దుర్గాదేవి గుడి కట్టారంటూ అసత్య ప్రచారంతో బుద్దిస్ట్ మాన్యుమెంట్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు బుధవారం ఆందోళన చేయడానికి యత్నించారు. చివరకు కొండపై ఎటువంటి కొత్త నిర్మాణాలు లేకపోవడంతో వెనుదిరిగారు. ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు కొండపై ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న సీఐ లక్ష్మణమూర్తి సంఘటన స్థలానికి చేరుకున్నారు. గుడి నిర్మాణం ఎక్కడ జరిగిందో చూపించాలని ప్రొటెక్షన్ కమిటీ కన్వీనర్ కొత్తపల్లి వెంకటరమణను ప్రశ్నించారు. గుడి కట్టినట్టు తమకు సమాచారం అందిందని, అందుకే ఇక్కడికి వచ్చామని ఆయన బదులిచ్చారు. ఆఖరికి కొండపై ఎటువంటి గుడి నిర్మాణం లేకపోవడంతో కమిటీ సభ్యులు వెనుదిరిగి వెళ్లిపోయారు. దీనిపై పురావస్తు శాఖ ఏడీ వెంకటరావును వివరణ కోరగా.. కొండపై ఎటువంటి గుడి నిర్మాణం చేపట్టలేదని, అది అసత్య ప్రచారమని స్పష్టం చేశారు. జీ–20 సదస్సు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అభూత కల్పనలు సృష్టించాలనే ఉద్దేశంతో ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నట్టు ఆయన అభిప్రాయపడ్డారు.

స్టంట్స్ చేసిన యువకులకు జరిమానా


అప్పికొండ తీరంలో బైక్‌తో స్టంట్స్ చేస్తున్న యువకుడు

పెదగంట్యాడ: అప్పికొండ తీరంలో బైక్‌లతో ప్రమాదకరమైన విన్యాసాలు చేయడంతో పాటు పర్యాటకులు, స్థానికులను భయాందోళనకు గురి చేసిన నలుగురి యువకులపై దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిని ఫస్ట్ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట బుధవారం హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ యువకులకు జరిమానా విధించారు. దువ్వాడ సీఐ బి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 77వ వార్డు పరిధి అప్పికొండ తీరంలో ఈ నెల 13న నలుగురు యువకులు ర్యాష్‌గా డ్రైవింగ్ చేయడంతో పాటు ప్రమాదకరమైన విన్యాసాలు చేసిన విషయం తెలిసిందే. వారు చేసిన విన్యాసాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దువ్వాడ పోలీసులు స్పందించారు. ఆ విన్యాసాలు చేసిన గాజువాక మండలం శ్రీనగర్‌కు చెందిన సాగిరాజు అవినాష్‌రాజు, బోనెల రోహిత్, ఉప్పలపాటి నితీష్, హైదరాబాద్‌కు చెందిన వియ్యపు రిషి సాయి గణేష్‌ని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత ఆ నలుగురిపై కేసు నమోదు చేసి మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ వారికి జరిమానా విధించి.. భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు.

నగరంలో 'ఆర్‌సీ 15' షెడ్యూల్ పూర్తి

హైదరాబాద్ పయనమైన హీరో రామ్‌చరణ్


విశాఖ విమానాశ్రయంలోకి వెళ్తున్న హీరో రామ్‌చరణ్

కొమ్మాది/గోపాలపట్నం: దిల్ రాజు నిర్మాణంలో శంకర్ దర్శకత్వంలో మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ఆర్‌సీ 15 సినిమా చిత్రీకరణ బుధవారం జగదాంబ జంక్షన్‌లో జరిగింది. ఇక్కడ రామ్‌చరణ్, డాన్సర్లపై ఓ పాటను చిత్రీకరించారు. వారం రోజుల పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ జరిగింది. బుధవారంతో ఈ సినిమా షెడ్యూల్ పూర్తి కావడంతో.. రామ్‌చరణ్ మధ్యాహ్నం 2 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ పయనమయ్యారు. విమానాశ్రయంలో ఆయనకు అభిమానులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన్ని తమ సెల్‌ఫోన్లలో బంధించేందుకు ఎగబడ్డారు.